Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 105 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
మంగళవారం, 28 - 10 - 2025
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన : సిబిఐ దర్యాప్తు అవకాశం




**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా పెరుగుతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మోసాల్లో డిజిటల్ కేటుగాళ్లు.. తమను తాము పోలీసు, సిబిఐ, ఈడి అధికారులుగా ప్రదర్శించుకుని, తప్పుడు కోర్టు ఆదేశాలు చూపించి అమాయకుల నుంచి డబ్బు దోచేస్తున్నారు. ఈ సైబర్ క్రైమ్‌లు 'సిస్టమ్‌లో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి' అని సుప్రీంకోర్టు హెచ్చరించింది. సుమో టోగా కేసును విచారణకు తీసుకున్న జస్టిస్ సూర్య కాంత్, జయమల్య బాగ్చీలతో కూడిన బెంచ్, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఈ మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ఎఫ్ఐఆర్‌ల వివరాలు, దర్యాప్తు పురోగతి, ఫిర్యాదుల సంఖ్య వంటి సమాచారాన్ని అందించాలని కోర్టు రాష్ట్రాల్నీ, యూటీలను ఆదేశించింది. నవంబర్ 3న మరోసారి విచారణ జరుపుతామని చెప్పింది. ఈ అంశం మీద సిబిఐ దర్యాప్తు చేపట్టాలా, లేదా? అనే అంశంపై కోర్టు నిర్ణయాన్ని వెలువరించనుంది. ఈ క్రైమ్‌లు పాన్-ఇండియా స్థాయిలో, అంతర్జాతీయ లింకులతో (మయన్మార్, థాయ్‌లాండ్ నుంచి) జరుగుతున్నాయని గుర్తించి, అన్ని కేసులను సిబిఐకు అప్పగించే అవకాశం ఉందని సూచించింది. సిబిఐకు ఈ కేసులను డీల్ చేయడానికి అదనపు వనరులు, సైబర్ ఎక్స్‌పర్టులు అవసరమా? అని కూడా కోర్టు ప్రశ్నించింది. సిబిఐ ప్రతినిధి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కొన్ని కేసులపై ఇప్పటికే దర్యాప్తు జరుగుతోందని కోర్టుకు తెలిపారు. ఈ మోసాలు ప్రత్యేకించి సీనియర్ సిటిజన్స్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఉదాహరణకు హర్యానా అంబాలాలో ఒక వృద్ధ దంపతుల నుంచి రూ.1.05 కోట్లు మోసం చేసిన కేసు (సెప్టెంబర్ 2025) ఆధారంగా కోర్టు స్పందించింది.

## మొంథా తుపాను ప్రభావంపై సచివాలయం నుంచి సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్‌పై ఆర్టీజీఎస్‌లో అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష. మొంథా తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రితో ఫోన్లో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ. ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి లోకేష్‌కు సీఎం సూచన. ప్రస్తుతం కాకినాడకు 680 కి.మీ దూరంలో ఉన్న మొంథా తుఫాన్. 16 కి.మీ వేగంతో తీరాన్ని సమీపిస్తున్న తుఫాన్. నేటికీ కృష్ణా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచన. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాలకు భారీ వర్షాలు. నేటి రాత్రికి తుఫాన్ తీరాన్ని తాకే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అధికారులు. ప్రతీ గంటకు తుఫాన్ కదలికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలన్న సీఎం చంద్రబాబు. వర్షాలు, వరదలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం. కాలువ గట్లు పటిష్టం చేసి పంట నష్టం జరగకుండా చూడాలని అధికారులకు చెప్పిన సీఎం. సమీక్షకు పాల్గొన్న మంత్రులు లోకేష్, అనిత, సీఎస్, ఇతర ఉన్నతాధికారులు.

## మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఇరిగేషన్ శాఖ అప్రమత్తంగా ఉండాలి : మంత్రి నిమ్మల



**అమరావతి, (రాజధాని వార్తలు):** మొంథా తుపాను నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఏపీ సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకి కడా స్పెషల్ కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, సీఈలు, ఎస్ఈలు, ఈఈలు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకి తుపాను నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు మంత్రి నిమ్మల రామానాయుడు. తుపాను ప్రభావిత ప్రాం తాల్లో సీఈ స్థాయి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. గేట్లు, స్ల్యూయిజ్‌లు, సక్రమంగా పని చేస్తున్నాయో లేదో వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. చెరువులు, కాల్వగట్లు కోతకు గురైతే తక్షణమే మరమ్మతులు చేయాలని ఆజ్ఞాపించారు. దిగువకు నీరు విడుదల చేసే ముందు, సమీప నీటి ప్రవాహ ప్రాంత ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని మార్గనిర్దేశం చేశారు మంత్రి నిమ్మల రామానాయుడు. ఎన్టీఆర్ జిల్లాలో వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకోని, బుడమేరు డైవర్షన్ ఛానెల్‌పై నిరంతర నిఘా ఉంచాలని దిశానిర్దేశం చేశారు. వెలగలేరు రెగ్యులేటర్ నుంచి ఎనికేపాడు యూటీ వరకు విజయవాడ నగర పరిధిలో.. పాత బుడమేరు సమీప ప్రాంతంలో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని ఆదేశించారు. ఎర్ర కాలువ, యనమదురు డ్రైన్, బురద కాలువ, సుద్ద వాగు, ఏలేరు రిజర్వాయర్, రైవాడ కాలువ వంటి వాటిపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, శాఖలతో ఎప్పటికప్పుడూ సమన్వయం చేసుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడు దిశానిర్దేశం చేశారు.

## మొంథా తుఫానుపై సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా ఇన్చార్జి మంత్రి నారాయణ : జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేక అధికారి కృష్ణ తేజ

**కాకినాడ, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను ప్రభావంపై సోమవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఉన్నత స్థాయి అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా ఇన్చార్జి మంత్రి నారాయణ, ప్రత్యేక అధికారి కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జీ.బిందు మాధవ్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ, అమలాపురం పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జీఎం.హరిష్ బాలయోగిలతో కలిసి హాజరయ్యారు. తుఫాను ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి, ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. తుఫానుకు ఎక్కువగా ప్రభావితం అయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలను సురక్షిత ప్రదేశాలకు,




పునరావాస కేంద్రాలకు తరలించాలని సీఎం అధికారులను ఆదేశించారు. గతంలో సంభవించిన తుఫాను సంఘటనలను ఆధారంగా అధికారులు మరింత సమర్ధవంతంగా పని చేయాలన్నారు.

## మొంథా తుపాన్.. విశాఖ మేయర్ ఎమర్జెన్సీ మీటింగ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మొంథా తుపాన్ నేపథ్యంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మొంథా తుపాన్ నేపథ్యంలో పూర్తిగా అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం ఎప్పటికప్పుడు సమీక్షలు, క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితిని అంచనా వేస్తున్నామన్నారు. ఆర్కే బీచ్ పరిసర ప్రాంతాలు, నైట్ షెల్టర్స్‌ను స్వయంగా వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. ఎటువంటి పరిస్థితి ఏర్పడినా ఎదుర్కొనేందుకు జీవీఎంసీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తుపాన్ తీవ్రత తగ్గే వరకు 24×7 అధికారులు, కార్మికులు అందుబాటులలో ఉంటారని వెల్లడించారు. రాత్రి సమయంలో పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించామన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పుకొచ్చారు. విద్యుత్, తాగునీరు, మౌలిక సదుపాయాలకు ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మరోవైపు మొంథా తుపాన్ ప్రభావంతో కోస్తా జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. తుపాన్ దగ్గరకు వచ్చేకొద్ది మారింత ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. గడిచిన 6 గంటల్లో గంటకు 17 కి.మీ. వేగంతో మొంథా తుపాన్ కదిలిందని.. ప్రస్తుతానికి చెన్నైకి 480 కి.మీ., కాకినాడకు 530 కి.మీ., విశాఖ పట్నానికి 560 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందన్నారు. పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రేపు (మంగళవారం) ఉదయానికి తీవ్ర తుపాన్‌గా మారే అవకాశం ఉందని తెలిపారు. రేపు రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ చెప్పారు. తీరం వెంబడి గంటకు 90-110 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని.. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచనలు చేశారు.

## తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తిగా జస్టిస్ సూర్య కాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్య కాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక ప్రక్రియను కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటు చేసుకుంది. నిబంధనల ప్రకా రం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయ స్థానంలో జస్టిస్ కాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దేశ 53వ సీజేఐగా జస్టిస్ కాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు.

**జస్టిస్ సూర్యకాంత్ ఎవరు?**

హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్య కాంత్ జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. 370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఎన్నికల జవాబుదారీతనంపై తన నిబద్ధతను చాటుకుంటూ బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని చారిత్రక ఆదేశాలు సైతం ఇచ్చారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపాలపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు. రక్షణ బలగాలకు ఓఆర్ఓపీ స్కీమ్‌ను సైతం ఆయన ధ్రువీకరించారు. పెగాసస్ స్పైవేర్ కేసును విచారించిన ధర్మాసనంలోనూ జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.



రాజధాని అమరావతిలో ఎస్‌డిపిఓ కార్యాలయ నిర్మాణం
E5-N11 జంక్షన్‌లో జరుగుతోంది. ఫోటో సేకరణ - యస్ ఆర్ ఆర్

# పల్లిపాలెంలో శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు దాట్ల సుబ్బరాజు





**డాక్టర్. బి.ఆర్‌అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం, (రాజధాని వార్తలు):** ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, పల్లిపాలెంలో వెలసి యున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సతీ సమేతంగా దర్శిం చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిం చారు. అర్చకులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేని స్వాగతించి, స్వామి వారి తీర్థప్రసాదం మరియు ఆశీర్వచనాన్ని అందజేశారు. తరువాత దాట్ల సుబ్బరాజు అక్కడ ఏర్పాటు చేసిన అరుణాచల గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ప్రదక్షిణ చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో నాగుల చవితి




**గజపతినగరం,(రాజధాని వార్తలు):** హిందువుల పవిత్ర పండగల్లో ఒకటైన నాగుల చవితి పర్వదినాన్ని మండలంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సాంప్రదాయ వస్త్రధారణతో కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు వెళ్లి పూజలు జరిపారు. పుట్టలో పాలు, గుడ్లు, నూముద్దలు వేసి పూజలు చేశారు. పుట్ట వద్ద బాణాసంచా కాల్చారు.

వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కుటుంబ సమేతంగా పుట్ట వద్ద నాగేంద్రునికి పూజలు జరిపారు.

# భక్తి పారవశ్యం.. కన్నుల పండువగా నాగుల చవితి వేడుకలు

## - నాగ దేవతకు ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ కుటుంబం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** కార్తీక శుద్ధ చవితి సందర్భంగా శనివారం తెలుగు లోగిళ్లలో నాగుల చవితి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. నాగదేవతను ఆరాధించడం ద్వారా సకల దోషాలు తొలగి, కుటుంబ క్షేమం, సంతాన సౌభాగ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, వై.ఎస్.ఆర్.సి.పి. జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) విజయనగరం, ధర్మపురిలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన సతీమణి మజ్జి పుష్పాంజలి, అల్లుడు ప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ పాల్గొన్నారు. వీరంతా పసుపు, కుంకుమ, పూలతో నాగదేవత పుట్టను అలంకరించి, భక్తి పారవశ్యంతో నాగేంద్ర స్వామి పుట్టలో ఆవు పాలు పోశారు.



అనంతరం నాగదేవతకు చలిమిడి, చిమ్మిలి, వడపప్పు, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. తదనంతరం తమ కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రాంత ప్రజలకు పాడి పంటలు సమృద్ధిగా లభించాలని నాగదేవతను వేడుకున్నారు.

# ఎటువంటి ప్రాణ నష్టం జరగరాదు

## - మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళరాదు- ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలి - మొంత తుఫానుపై అధికారులను, ప్రజలను అప్రమత్తం చేసిన కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** వచ్చే కొన్ని రోజుల్లో మొంత తుఫాను కాకినాడ, విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో దాని ప్రభావంతో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి అప్రమత్తతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం రెండు విడతలుగా నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా తుఫాను తాకిడి తీరప్రాంత జిల్లాలలో ఉండే అవకాశం ఉందన్న సమాచారం మేరకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొన్ని సూచనలు జారీ చేసారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ శాఖలు మానవ నష్టం జరగకుండాఅన్నీ ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఇరిగేషన్ శాఖ వర్షాల అంచనాలను బట్టి కాల్వల్లో ప్రవాహం, రిజర్వాయర్ల నిల్వ స్థాయిలను పర్యవేక్షించాలి. వ్యవసాయ శాఖ రైతులకు పంట పరిరక్షణకు సంబందించిన హెచ్చరికలు ఇచ్చి జాగ్రత్త చర్యలు సూచించాలి. పౌర సరఫరాల శాఖ అవసరమైన బియ్యం, నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ నిల్వలను తగిన చోట్ల సిద్ధంగా ఉంచాలి. ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపాలిటీ శాఖలు తాగునీటి ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఏపీఈపిడీసీఎల్ శాఖ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా హై అలర్ట్‌లో ఉండాలి. కలెక్టర్ కార్యాలయం, ఆర్డిఓ, మున్సిపాలిటీలు, తహసీల్దార్ కార్యాలయాలు, విద్యుత్, అగ్నిమాపక శాఖల్లో 24/7 కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలి. ఫైర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ శాఖలు అప్రమత్తంగా ఉండి సమన్వయం చేసుకోవాలి. ఆరోగ్య శాఖ వైద్యసేవలను 24 గంటలు అందుబాటులో ఉంచాలి. ఏ అధికారి అయినా అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయం వదిలి వెళ్లరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో మానవ నష్టం ఒక్కటి కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం ప్రజల భద్రతను ప్రధాన లక్ష్యంగా తీసుకుని పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీలు, మండలాలులో లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ అవసరమైన పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తగిన ఆహారం, త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆర్ & బి, పంచాయతీ రాజ్ శాఖలు రోడ్లు, కల్వర్టులు చెక్ చేసి, ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదలు సంభవించే అవకాశం ఉన్న చెరువులు, నదులు వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలెవ్వరు ప్రవాహ ప్రాంతాలలో సంచరించరాదనీ తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు కంట్రోల్ రూమ్‌లు సిద్ధం చేసుకుని పవర్ కట్ ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, మొబైల్ చార్జింగ్ సదుపాయాలు, జనరేటర్లు, సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా సెల్ టవర్లకు విద్యుత్ లేక సిగ్నల్ లేని పరిస్థితి రాకూడదని, వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలనీ ఆదేశించారు. భారీ గాలులు కూడా వచ్చే అవకాశం ఉన్నందున పడిపోయిన చెట్లు, హోర్డింగులు వెంట వెంటనే తొలగించడానికి అవసరమైన అన్ని పరికరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. తుపాను సమయంలో అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. సెలవులో ఉన్న అధికారుల సెలవులు రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు. తుపాన్ కంట్రోల్ రూముల వివరాలు- కలెక్టర్ ఆఫీస్ : 08922-236947, 8523876706, రెవెన్యూ డివిజనల్ ఆఫీస్, విజయనగరం 8885893515, రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ చీపురుపల్లి 9704995807. రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ బొబ్బిలి 9989369511. మున్సిపల్ కార్పొరేషన్ విజయనగరం 9849906486 ఏపీ ఈపీడీసీఎల్ 9490610102 టోల్ ఫ్రీ నెంబర్ 1912.

# సర్దార్ @ 150 యూనిటీ మార్చ్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎంపీ




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఉక్కు మనిషి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సర్దార్ 150 యూనిటీ మార్చ్ బ్రోచర్‌ను నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన కేంద్ర క్రీడా యువజన విభాగం ఆదేశాలతో శనివారం విపిఆర్ నివాసంలో నెల్లూరు యువజన అధికారి మహేంద్రతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంవత్సరం జాతీయ సమైక్యతా నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి అని ఆయన అసాధారణ కృషి, వారసత్వాన్ని గౌరవిస్తూ, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ MY BHARATH ద్వారా "సర్దార్@150" పేరుతో దేశవ్యాప్తంగా కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరులోని విఆర్‌సీ మైదానం నుంచి వేదాయపాలెం వల్లభబాయ్ విగ్రహం వరకు పాదయాత్ర ఉంటుందని అధికారులు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఈ పాదయాత్రలో పాల్గొని వల్లభబాయ్ ఆశయాల సాధనకు కృషి చేయాలని ఎంపీ వేమిరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి ఎన్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరుస ప్రమాదాలతో ఉలిక్కిపడిన రాష్ట్రప్రభుత్వం

## - అప్రమత్తమైన ఆర్టీవో శాఖ - ప్రైవేట్ బస్సులపై తనిఖీలు




**కాకినాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో వరుస రహదారి ప్రమాదాలు ఆందోళనకు గురిచేయడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో రవాణా శాఖ అధికారులకు అత్య వసర ఆదేశాలు జారీ చేయడంతో ఆర్టీవో అధికారులు కఠిన తనిఖీలు ప్రారంభించారు. రెండో రోజు కూడా కాకినాడ జిల్లా పరిషత్ కేంద్రంలో ప్రైవేట్ స్టేజ్ క్యారియర్ బస్సులపై విస్తృత స్థాయిలో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ తనిఖీల ప్రభావంతో అధిక సంఖ్యలో బస్సులు అక్కడికక్కడే నిలిచిపోయాయి. ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు, ఇన్సూరెన్స్, సర్వీస్ రికార్డులు, భద్రతా ప్రమాణాల పరిశీలనలో లోపాలు తలెత్తడంతో అనేక బస్సులకు అనుమతులు నిలుపుదల చేసినట్లు సమాచారం. రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ, "ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఎలాంటి రాజీ చేయం. నిబంధనలు ఉల్లంఘించే బస్సులపై కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. ఈ చర్యలతో ప్రయాణికుల భద్రతకు మరింత బలపడే అవకాశం ఉన్నప్పటికీ, ప్రైవేట్ బస్సు యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# యువజన విభాగం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు వి ఆర్ సి సెంటర్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు యస్థాని ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు నగర నియోజకవర్గ పరిశీలకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి, హాజరై..కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా గవర్నర్ అందించబోయే పత్రుల మీద పలువురు సంతకాలు చేసి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రజలు నిరసిస్తున్నప్పటికీ.. కూటమి ప్రభుత్వం ఏమాత్రం లెక్క చేయకుండా..ఏకపక్షంగా ముందుకు పోవడం దుర్మార్గం అన్నారు. చంద్రబాబు నాయుడు మెడికల్ కళాశాలలను తన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులకు ఎకరా 100 రూపాయలు చొప్పున అప్పనంగా కట్టబెడుతూ ప్రభుత్వ సొమ్మును దోచిపెడుతున్నారని మండిపడ్డారు. మెడికల్ కళా శాలల ప్రైవేటీకరణను అడ్డుకునే దిశగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాలుగా పోరాడుతుందన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటుకరణను అడ్డుకునే దిశగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా ఉద్యమం చేపట్టేందుకు నిర్ణయించారని తెలిపారు. అందులో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి కోటి మంది సంతకాలు చేసిన పత్రులను గవర్నర్‌కి అందించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా పోరాటం సాగించనున్నమని తెలిపారు. అందులో భాగంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రతి డివిజన్‌లతో పాటు నగరంలోని ప్రధాన కూడళ్ళు విఆర్సి, గాంధీ బొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాలలో కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రజలు ప్రతి ఒక్కరిని ఏకం చేసి మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేయడం వల్ల జరిగే నష్టాలను వివరించి ప్రజల చేత సంతకాలు చేయించడం జరుగుతుందన్నారు. ఈరోజు నెల్లూరు విఆర్సి సెంటర్‌లో యువజన విభాగం నాయకులు యస్దాని ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగస్వాములు అవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈరోజు మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరిస్తే దానివల్ల ప్రజలకు ఎలాంటి నష్టం చేకూరుతుందన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. రాబోయే 20 రోజులు పాటు ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి విజయవంతంగా నిర్వహించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి పెర్నాటి కోటేశ్వర రెడ్డి, కార్పొరేటర్లు మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు ఉమా మహేష్,జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయ కృష్ణారెడ్డి, కరీముల్లా, నీలి రాఘవ రావు, మైనార్టీ భాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు హంజా హుస్సేని, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి జహీద్, 11 డివిజన్ ఇన్ చార్జ్ మహేష్ యాదవ్, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఈనెల 28న చేపట్టనున్న ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రాంజీ నగర్ వైసిపి సిటీ ఆఫీసులో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ చేపట్టనున్న నిరసన పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్చార్జులు, నేతలతో కలిసి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నెల్లూరు నగర నియోజకవర్గ పరిశీలకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి జగన్మోహన్ రెడ్డి పాలన ప్రారంభమయ్యే వరకు కేవలం 11 మెడికల్ కళాశాలలో ఉంటే ఈ రాష్ట్రానికి ఏకంగా 17 నూతన మెడికల్ కళాశాలలను తీసుకు వచ్చిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి దన్నారు. ఈరోజు జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన మెడికల్ కళాశాలన్నిటిని అమ్మకానికి పెట్టిన చరిత్ర చంద్రబాబు నాయుడుదన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు, పోరాటాలు చేపడుతున్నామని తెలిపారు. దీనిపై ప్రజల్లో ఎంతో వ్యతిరేకత ఉన్నప్పటికీ ఎలా అయినా సరే మెడికల్ కళాశాలలను.. అమ్మేయాలనే దుర్బుద్ధితో చంద్రబాబు నాయుడు కుటిల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడుకు సంబంధించిన ఎమ్మెల్యేలు, మంత్రులకు ఈరోజు మెడికల్ కళాశాలను అప్పనంగా దోచిపెడుతున్నారని అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిలిపివేసే దిశగా వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఉధృతంగా సాగుతుందన్నారు. ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఇంట్లో ప్రతి ఒక్కరు స్పందిస్తున్న తీరు చూస్తుంటే ఇవి కోటి సంతకాలు కాదు 2 కోట్ల సంతకాలైన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అన్నారు. నెల్లూరు నగరంలో కూడా ఈ కోటి సంతకాల సేకరణ 60 వేలు అనుకుంటే లక్ష దాటిపోయే పరిస్థితి కనిపిస్తుంది అన్నారు.

ఇందులో భాగంగా ఈ నెల 28వ తేదీ వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని వి ఆర్ సి అంబేద్కర్ బొమ్మ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ప్రజలతో ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కి మెమొరాండం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం తగదని ప్రభుత్వం పునరాలోచించుకొని ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకో వాలన్న డిమాండ్ తెలియజేసి తమ విజ్ఞప్తిని ప్రభుత్వానికి పంపాల్సిందిగా కోరతామన్నారు. ఈనెల 28వ తేదీ నెల్లూరు నగర నియోజకవర్గంలో జరగనున్న ర్యాలీకి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ భాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి పెర్నాటి కోటేశ్వర రెడ్డి, కార్పొరేటర్లు మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు ఉమా మహేష్, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు హంజా హుస్సేని, జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయ కృష్ణారెడ్డి, కరీముల్లా, కామాక్షి దేవి, జయలక్ష్మి, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి జహీద్, 4, 5, 11, 52 డివిజన్ ఇన్‌చార్జ్‌లు సందాని, సుబ్బా రెడ్డి, మహేష్ యాదవ్, మహబూబ్ బాషా, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి వేమిరెడ్డి దంపతులకు ఆహ్వానం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మూలాపేటలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పునః నిర్మాణ కార్యక్రమం ఈనెల 29న జరగనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలను ఆలయ అధికారులు అర్చకులు ఆహ్వానం పలికారు. ఈ మేరకు శనివారం నగరంలోని విపిఆర్ నివాసంలో ఇందుకు సంబంధించి కరపత్రాలను వేమిరెడ్డి దంపతులకు అందజేశారు. స్థానిక మూలాపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయాన్ని సుమారు 16.7 కోట్ల రూపాయలతో దేవస్థానం పునః నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి స్వహస్తములతో శ్రీకారం చుడుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# ఆదాల ప్రభాకర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పాశం శ్రీనివాస్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రివర్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా పార్లమెంటు ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డికి కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీసులతో నిండు నూరేళ్ళు ఆయు ఆరోగ్యలతో అష్టా ఐశ్వర్యాలతో ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు ఇట్లు మీ పాశం శ్రీనివాస్ మాజీ ఏపి స్టేట్ ఎంఎస్ఎంఇ డైరెక్టర్.

# రూ.4.60 కోట్లు దాటిన సీఎం సహాయ నిధి

## - సర్వేపల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి భారీగా ఆర్థిక సాయం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని వేదాయపాళెం కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో 36 మందికి రూ.44.40 లక్షలు విలువైన చెక్కులు పంపిణీ చేసిన శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. ప్రతి పది పదిహేను రోజులకు పలువురికి చెక్కులు తెచ్చి ఇస్తూనే ఉన్నాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను పట్టించుకున్న పాపాన పోలేదు. మా నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4.60 కోట్లకు పైగా ఆర్థికసాయం మంజూరు చేయించాం. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చినా ఆమోదించి ఆర్థికసాయం చేయడంలో ముందున్న సీఎం నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదములు.

# పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను మంజూరు చేయాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శనివారం రాత్రి కలెక్టరేట్లో తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి పరిశ్రమలు,ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న వెంటనే భూ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి వసతి, విద్యుత్ మొదలైన కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. తొలుత పరిశ్రమల శాఖ జిఎం మారుతి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పలు పరిశ్రమలకు సంబంధించి సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 4912 అప్లికేషన్లు వివిధ శాఖల అనుమతుల కోసం నిర్వాహకులు దరఖాస్తు చేసుకోగా, 4778 దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి అనుమతులు మంజూరు చేసినట్లు కలెక్టర్ కు వివరించారు. మిగిలిన అప్లికేషన్లు కూడా త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

ఈ సమావేశంలో ఏపీఐఐసీ జెడ్ ఎం శివకుమార్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్ కుమార్, ఇరిగేషన్ ఎస్ ఈ దేశ్ నాయక్, డిటిసి చందర్, పలు పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఓటర్లు సజావుగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుకూలంగా పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు కల్పించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శనివారం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం 6లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫారం 6 లను సంపూర్ణంగా పూర్తిచేసే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు నూతన ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా చనిపోయిన వారిని ఓటరు జాబితా నుండి తొలగించేందుకు వారి మరణ ధ్రువీకరణ పత్రాలను పొందే విధంగా వారి కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. అదేవిధంగా పోలింగ్ బూత్‌ల మార్పు గురించి అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీలు ముందస్తుగా తెలపాలన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ విజయ్ కుమార్, టిడిపి – రసూల్, వై ఎస్ ఆర్ సి పి – వెంకట శేషయ్య, బీఎస్పీ– శ్రీరామ్, బి జె పి– శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు.

# సంపాదకీయం

## కళింగాంధ్రనేల సారంతో రామకృష్ణకవి నలచరిత్ర

దార్శనికుడు గురజాడ, గిడుగు, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, తాతాజీ, ఆరుద్ర, చాసో, రావిశాస్త్రి, కారా లాంటి ఉద్ధండుల్ని కళింగాంధ్ర సాహిత్యం అందించింది. వీరు ఆధునిక సాహిత్యస్రష్టలు. అనేక ప్రక్రియలకు ఆదిగురువులు. కాగా ఇక్కడే మూడు వందలయేళ్ల క్రిందట పుట్టిన బెహరా రామకృష్ణ వెయ్యేళ్ల పద్య కవులెవరికీ తీసిపోని విధంగా, నలచరిత్రను కమనీయ ప్రబంధంగా మృదుమధురంగా రచించడాన్ని ఇక్కడి మట్టిసారంగా భావించవచ్చు. బెహరావారు శ్రీకాకుళం జిల్లాకేంద్రానికి సమీపంలోని బొంతలకోడూరు మిరాసీదార్లు. కటకం గజపతుల ఆదరణతో వారితోపాటు పఠననాయకులుగా వచ్చి ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు. పట్నాయకులుగా, శిష్ట కరణాలుగా పిలవబడుతున్నారు. నలచరిత్రలో ఈయన వాడిన లాంతరు, ముక్కాలు వంటి పదాలవలన ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో జీవించాడని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. అందుచేత క్రీ.శ.1800 లకు ముందే ఈ గ్రంథాన్ని రాశాడని చెప్పవచ్చు. గతంలో సంస్కృతాంధ్ర సాహిత్యాల్లో వచ్చిన నల చరిత్రలను బెహరా రామకృష్ణకవి చదివే ఉంటారు. ఈ గ్రంథంలో నన్నయ నుండి చేమకూర వరకూ తారసపడుతున్న పద్యసరళులు ఈ విషయాన్నే చెబుతున్నాయి. గ్రంథాన్ని పరిపుష్టం చేయడానికి నలుడి వేట ఘట్టంతోపాటు మరికొన్ని కల్పనలు, తదితర వర్ణనలను కథానుకూలంగా మూలానికి జోడించారు. మూత్ర విసర్జన తరువాత కాళ్ళు కడుక్కోకుండా సంధ్యావందనం చేయడం వల్ల నలుని శరీరంలోకి శని ప్రవేశించాడని నన్నయాదులు రాశారు. నలుడు వంటి నిష్ఠాగరిష్ఠునికి అలాంటి నైచ్యాన్ని అంటగట్టడం సరికాదని భావించి, "ఒగి ౘబదమున సూచికమోప ౘగలట్టి ప్రదేశమపు డపరిశుద్ధత నుండఁగ సంధ్యోపాసన"-అని సవరించాడితడు. నలుడు కాళ్ళు కడుక్కున్నప్పుడు సూదిమోపినంత చోటు తడవకుండా ఉండిపోయిందట. దానిలోంచి శని లోపలికి ప్రవేశించాడని మార్చి, కథను ఔచిత్యవంతం చేశారు. 1511 పద్యగద్యాలతో ఈ ప్రబంధాన్ని రచించారు రామకృష్ణకవి. నగర, ఋతు, పుష్పాపచయ, సూర్యోదయ, సూర్యాస్తమయాది అష్టాదశ వర్ణనలలో ఒకటి రెండు తప్ప అన్ని రకాల వర్ణనలూ హృదయాహ్లాదంగా రచించారు రామకృష్ణకవి. "వనరమాయువతి పుష్పవతి యయ్యె" - ఈ పాదంలో శ్లేష ఉంది. తోటంతా పుష్పించింది అని ఒక అర్థం, పుష్పించడంవల్ల వనలక్ష్మి ఈడేరిందని వేరే అర్థం స్ఫురిస్తోంది కదూ! కనకకారవృత్తిని వాడుకుంటూ ఇంకొక అద్భుతవర్ణన. "కరగిన పూదెఁ దాఁ గనకకారుఁడు నీటనుముంచు మాడ్కి భాన్కరుఁ డపరాబ్ధిలోన ౘదిగఁజారెఁ"-. నలుడి వేటవర్ణనలో సాయంసంధ్యను వర్ణిస్తున్నాడు. కరిగించిన బంగారు ముద్దను స్వర్ణకారుడు నీటిలోముంచుతున్నాడా అన్నట్టు సాయంసంధ్యావేళ సూర్యుడు పశ్చిమ సముద్రంలో మునిగిపోతున్నాడట. ఉత్ప్రేక్ష ఎంత అద్భుతమో అంత రమణీయం. ఏ గ్రంథంలోనైనా రచయిత అస్తిత్వం ఎక్కడో ఓచోట పట్టుబడుతుంది. బెహరావారు గ్రీష్మఋతు వర్ణనలో "గావిరి యీవలి గలియఁగ్రమ్మె" అని రాశారు. ఈ సీసపద్య చివరిదళానికి 'నల్లని వేడిపొగలు అంతటా కమ్మాయి' అని అర్థం. ఈ పాదంలో ఈవలి అని ఉంది. వేసవి వేడి వేళ కలిగే దాహాన్నే ఈవలి, ఈష్ట అని కళింగాంధ్రలో అంటారు. దాహం వేస్తుంది అనడానికి ఈవలేస్తుంది, ఈష్టగా ఉంది అని వాడుతారు. బలహీనుడిమీద కోపంవస్తే 'కొంకులిరగ్గొట్టీ గల్ను' అని ఇక్కడివారి వాడుక. ఈ గ్రంథంలో నలుడి వేటవర్ణనలో రెండుసార్లు కొంకులు పదాన్ని వరసపద్యాలలో వాడారు కవి. "నడుములు దునుమాడి తొడలుచెండాడి కొంకులుదెగ వ్రేసి చెంపలనుగోసి.... అత్తటి ముక్కులు చెక్కులు కుత్తుకలంసములు తలలు కొంకు లురములున్". ముంగాలి ఎముకల్నే కళింగాంధ్రులు కొంకులని అంటారు. పెళ్ళికి వచ్చిన బంధువులు వధూవరులకు ఈడు చదివించడం ఈ ప్రాంతంలో నేటికీ ఉంది. దీనినే బెహరావారు "వీడు/ చెలగి చదివించిరి వధూవరులకు నపుడు" అని ఒక పద్యంలో రాశారు. వీడు అంటే కట్నం. అందమైన వర్ణనలూ, అలంకారాలతోపాటు, వారి శబ్ద చమత్కారమూ ఉంది. "ఈయదు తనభావము చనవీయదు సఖులకును గోర్కులీయదు శుకి కం/ దీయదు ఫలములు తన పొందీయదు కేకులకుఁ జేరనీయదు గోరన్". ఇలా శబ్దిస్తూ, పద్యాలను జవనాశ్వాల్లా పరుగెత్తించడం ఈ కవికి వెన్నతోపెట్టిన విద్య. ఇలాంటి లయవిన్యాసమే ఈతని వచనరచనలోనూ గమనిస్తాం: "పుష్కరువలను నక్షంబులు పక్షంబులై యుండుటయు, నిజాధ్యక్షుని పక్షంబున విపక్షంబులగుటయు, సమక్షంబునన్ బరీక్షించి". గ్రంథం అంతటా అలంకారాలను విరివిగా వెదజల్లినా ఎక్కడా వ్యర్థపదాలుగానీ, ఊతపదాలుగాని తారసపడవు. అందుచేతనే బెహరా రామకృష్ణకవి 'నలచరిత్ర' మధుర ప్రబంధం. ఈ గ్రంథానికి సాహిత్యచరిత్రలలో తగు స్థానం లభించలేదు. 1933లో చివరిసారిగా ముద్రించారు. ఇన్ని ప్రత్యేకతలుగల గ్రంథం ఇటీవల పునర్ముద్రణ పొందిన విషయాన్ని సాహిత్యలోకానికి తెలియజేయాలనే ఈ ప్రయత్నం.

# కూరాడ డ్వాక్రా సంఘాల నిధుల దుర్వినియోగం కలకలం

## - కరప పోలీస్ స్టేషన్లో అధికారులు ఫిర్యాదు





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం కూరాడ గ్రామంలో డ్వాక్రా సంఘాల నిధుల దుర్వినియోగం బయటపడడంతో గ్రామం మొత్తం ఆగ్రహావేశాలతో కదలిక చెందింది. గ్రామ మహిళల ఆరోపణల ప్రకారం, వేళంగి స్టేట్ బ్యాంక్ ప్రొవైడర్ మరియు కొంతమంది యానిమేటర్లు కలిసి డ్వాక్రా సంఘాలకు చెందిన నిధులను అక్రమంగా వాడుకలోకి తీసుకున్నట్లు వెల్లడైంది. మహిళలు తమ రుణాలను సమయానికి చెల్లించగా, ఆ మొత్తాలను ప్రొవైడర్ బ్యాంకులో జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు మళ్లించినట్లు వెల్లడైంది. పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా ఖాతా వివరాలను దాచిపెట్టడం వల్ల నిజం వెలుగుచూడకుండా చేసారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇటీవల బ్యాంక్ నుంచి వచ్చిన మెసేజ్‌ల ద్వారా నిధుల డెబిట్ వివరాలు బయటపడటంతో ఈ దందా బట్టబయలైంది. దీంతో సుమారు 86 సంఘాలకు చెందిన మహిళలు కరప పోలీస్ స్టేషన్ ఎదుట, అలాగే వేళంగి స్టేట్ బ్యాంక్ వద్ద ధర్నాలు నిర్వహించి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌కు అధికారిక ఫిర్యాదు సమర్పించారు. డీ.ఆర్.డి.ఏ పీడీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏపీడీఎం ఎం.ఎం. జిలాని, కరప ఏపీఎం సత్యశ్రీ బాలాదేవి కలిసి కరప ఎస్ఐ తోట సునీతకు ఫిర్యాదు అందజేశారు. ఎస్ఐ సునీత మాట్లాడుతూ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, తప్పిదాలు నిరూపితమైతే సంబంధితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనతో గ్రామ స్థాయిలో ఆర్థిక వ్యవస్థపై నమ్మకం దెబ్బతినడంతో మహిళలు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# వైభవంగా కొరిపల్లెలో అయ్యప్ప రథోత్సవం





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం కొరిపల్లె గ్రామంలోని శ్రీ కోదండరామ ఆలయ పరిసరాల్లో, దీక్ష తీసుకున్న అయ్యప్ప స్వాములు అంగరంగ వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. రథయాత్ర ప్రారంభమైన వెంటనే గ్రామమంతా భక్తి శోభతో మార్మోగింది. గ్రామంలో గృహిణులు రంగురంగుల ముగ్గులతో వీధులను అలంకరించగా, భక్తులు పూలతోరణాలు, పండ్లు సమర్పించి మంగళహారతులతో స్వామి రథానికి ఘన స్వాగతం పలికారు. రథయాత్ర మార్గమంతా భజనలు, హరినామ స్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ 2024లో తొలిసారిగా రథోత్సవాన్ని నిర్వహించామన్నారు. అప్పటినుంచి స్వామి అనుగ్రహంతో, గ్రామ ప్రజల ఆశీస్సులతో ఇది మా వార్షిక ఆనవాయితీగా మారిందని పేర్కొన్నారు. ఈ రథోత్సవంలో 200 మంది మాలధరించిన అయ్యప్ప స్వాములు, పెద్దఎత్తున భక్తులు పాలు పంచుకున్నారు. భక్తిగీతాలతో, శబరిమలయ్య శోభాయాత్రతో కొరిపల్లె ఆధ్యాత్మిక క్షేత్రంలా మారిపోయింది.



# వారాహిదేవి ఆలయ ఆభరణాల తనిఖీ - అధికారిక రికార్డ్లో నమోదు







**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కొవ్వూరు గ్రామంలోని శ్రీ వారాహిదేవి ఆలయంలో భద్రపరిచిన ఆభరణాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ జువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ విళ్ళ పళ్లంరాజు నేతృత్వం వహించారు. ఆలయ సింగిల్ ట్రస్టీ ఆర్. సౌజన్య ఆధ్వర్యంలో అమ్మవారికి చెందిన ఆభరణాలను అధికారిక విధానంలో జెవిఓకు అప్పగించారు. తనిఖీ ప్రకారం ఆలయంలో బంగారం 4.3 గ్రాములు, వెండి 3.5 కిలోలు ఉన్నట్లు గుర్తించి సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఆలయం దేవాదాయ శాఖలోకి చేరుకునే ముందు ఇది ఒక ప్రైవేట్ వ్యక్తి ఆధ్వర్యంలో నడిచిందని, ఆ కాలంలో భక్తులు సమర్పించిన ఆభరణాల ఫోటోలు తమ వద్ద ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. భక్తులు అప్పట్లో సమర్పించిన ఆభరణాల గురించి ఆ ప్రైవేట్ నిర్వాహకుడిని అడిగితే, "తన వద్ద ఏ వస్తువులు లేవు, భక్తులే తిరిగి తీసుకు పోయారు" అని ఆయన తెలిపినట్లు జెవిఓ వివరించారు. జెవిఓ విళ్ళ పళ్లంరాజు మాట్లాడుతూ, "ఆగస్టు 15, 2025కు ముందు ఎవరు అమ్మవారికి ఆభరణాలు సమర్పించి ఉంటే వాటి వివరాలను వెంటనే దేవాదాయ శాఖకు అందజేయాలి. అప్పుడే వాటిని అధికారిక రికార్డులో నమోదు చేసి, అమ్మవారికి అలంకరణలో వినియోగిస్తాం," అని సూచించారు.

**ఆలయ అభివృద్ధిపై సంతసంతో భక్తులు**

ఆలయ పరిసరాలను పరిశీలించిన అనంతరం జెవిఓ, అన్నదానంలో భోజనం చేస్తున్న భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన రోడ్లు, షెడ్లు, టాయిలెట్లు, ప్రతిరోజూ జరిగే అర్చనలు, అభిషేకాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. జెవిఓ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతల సహకారంతో తాను వ్యక్తిగతంగా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ నిర్వహణలో సింగిల్ ట్రస్టీ సౌజన్య చూపిస్తున్న కృషిని ఆయన అభినందించారు.

# వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 28న వైసీపీ సూళ్లూరుపేటలో ఉద్యమం

**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** సూళ్లూరుపేట వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ సిపి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదిన ప్రజా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు సూళ్లూరుపేట ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి తెలియజేసారు. శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వైసీపీ నేతలు పాల్గొని వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేక ఉద్యమానికి సంబందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భముగా అల్లూరు అనిల్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధినాయకులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ ప్రెసిడెంట్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు మీజురు రామకృష్ణ రెడ్డి, బందిలి మహేష్, మాజీ శివాలయం చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైసీపీ నేతలు ఐత శ్రీధర్, తుపాకుల ప్రసాద్, బద్దెపూడి మోహన్ రెడ్డి, భగవాన్ దాస్, వాకాటి బాబురెడ్డి, కర్లపూడి సురేష్, సుధాకర్ మొదలియార్, వాసు మొదలియార్, హుస్సేన్, మల్లి శ్రీను, కాళహస్తి బాబు రావు, తదితరులు పాల్గొన్నారు.

# తొలి తిరుపతికి రూ. 2.34 లక్షలు ఆదాయం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం చదలాడ తిరుపతిలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక్క రోజు ఆధాయం రూ. 2,34,833 లక్షలు ఆధాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన తెలుపుతూ ఆలయానికి ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,51,570 అన్నదాన విరాళాల ద్వారా రూ. 67,918, కేశ ఖండన ద్వారా రూ. 2,360, తులాభారం ద్వారా రూ.250, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 12,735లు, వెరసి రూ. 2,34,833లు ఆదాయం వచ్చినట్టు ఈవో వివరించారు. కాగా శనివారం ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 18 వేల మంది కాగా 4వేల మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణ ఆచార్యులు, గ్రామ నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకొని తీరుతాం : మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీమంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు డాక్టర్ కాకాని గోవర్ధన్ రెడ్డి సూచన మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నాయుడుపేట మండలం కలిపేడు గ్రామంలో మండల అధ్యక్షులు ఓట్టూరు కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు, వైఎస్ఆర్సీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా సంజీవయ్య మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 17 మెడికల్ కళాశాలను రాష్ట్రానికి తీసుకువస్తే. మోసపూరిత హామీలతో అధికారాన్ని కైవసం చేసుకున్న కూటమి ప్రభుత్వం. వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకు వచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరించడానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కుట్టిల ప్రయత్నాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మండిపడ్డారు. పేదలకు వైద్యం, విద్యను అందించాలనే లక్ష్యంతో వైయస్ జగన్మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలను తీసుకువస్తే నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటిని తన అనునయులకు కట్టబెట్టేందుకు ప్రైవేటీకరించేందుకు సిద్ధపడ్డారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అందుకు వ్యతిరేకంగా పోరాటాలు ఉదృతం చేస్తుందని కచ్చితంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అనేది అడ్డుకుని తీరుతామని మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, పార్టీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, కట్ట భవాని రెడ్డి,పార్టీ ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరనాథ్ రెడ్డి, ఎంపీపీ కురుగొండ్ల ధనలక్ష్మి, వైయస్సార్సీపి ఓజిలి మండల మాజీ అధ్యక్షులు దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నాయుడుపేట ఏ.ఎం.సీ మాజీ చైర్మన్ ఒట్టూరు రాధాకిషోర్ యాదవ్, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వంద పడకల ఆసుపత్రికి ఎమ్మెల్యే చినరాజప్ప స్థల పరిశీలన




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి శనివారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్థల పరిశీలన చేశారు. పాండవుల మెట్ట సమీపంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వాసుపత్రిని ఆనుకుని ఈ స్థల పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో వంద పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి కృషి జరుగుతుందన్నారు. ఈ కృషిలో భాగంగా ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన చేపట్టామన్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణానికి సుమారు మూడు ఎకరాల స్థలం అవసరం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని చేర్చి ఉన్న రెవెన్యూ స్థలాన్ని ఈ ఆసుపత్రి నిర్మాణం కోసం పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీ రమణి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, తూతిక రాజు, రంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గీత గోవిందంకి ముందే ప్రేమ మొదలైందా...?



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రేమ వ్యవహారం ఇంకా సీక్రెట్‌గానే ఉన్నప్పటికీ అందరికీ తెలిసి ఓపెన్ సీక్రెట్‌గా మారి పోయింది. ఇటీవల రష్మిక మందన్న ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో అందరూ రౌడీ స్టార్ అంటూ అరుస్తున్న సమయంలో అందరికీ తెలిసిందే అన్నట్లుగా వ్యాఖ్యలు చేసింది. అంతే కాకుండా వీరిద్దరి మ్యారేజ్ ఎంగేజ్మెంట్ కూడా జరిగిందనే విషయం కూడా బయటకి వచ్చింది. ఇద్దరూ పలు సందర్భాల్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు, కొన్ని సార్లు వారే కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చాలాసార్లు వారు ప్రేమ విషయంను చెప్పకనే చెబుతూ వచ్చారు. కొందరు మొదటి నుంచి అనుమానం వ్యక్తం చేస్తూ ఉంటే, కొందరు మాత్రం అదేం లేదు అన్నట్లుగా అనుకుంటూ వచ్చారు. తీరా ఇప్పుడు చూస్తే గతంలో జరిగిన విషయాలు అన్ని ఒకసారి గుర్తు చేసుకుంటే చాలా సార్లు ఈ విషయంకు సంబంధించి లీక్‌లు వచ్చాయి అనిపించింది. ఒక రిసార్ట్‌లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన ఒకే పూల్‌లో ఉన్నారు. అయితే విడి విడిగా సింగిల్ ఫోటోలను వారు షేర్ చేశారు. ఆ ఫోటోలను మ్యాచ్ చేసిన సమయంలో చాలా సిమిలారిటీస్ ఉన్నాయి. దాంతో చాలా మంది విజయ్ దేవరకొండ, రష్మిక ప్రేమలో ఉన్నారు ఇదే సాక్ష్యం అన్నట్లుగా సోషల్ మీడియాలో హడావిడి చేశారు. అయితే వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం ముదిరింది డియర్ కామ్రేడ్ సమయంలో అని అంతా అనుకుంటారు. కానీ అసలు విషయం ఏంటంటే గీత గోవిందం సినిమా నుంచే ఇద్దరి మధ్య కనెక్షన్ క్రియేట్ అయింది. గీత గోవిందం షూటింగ్ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు అని గతంలో వచ్చిన బాలకృష్ణ అన్‌స్టాపబుల్ టాక్ షో క్లిప్స్ ను చూస్తే అర్థం అవుతుంది. యానిమల్ ప్రమోషన్ సమయంలో బాలకృష్ణ టాక్ షోలో రష్మిక మందన్న, రణబీర్ కపూర్ పాల్గొన్నారు. అదే షోలో సందీప్ వంగ పాల్గొనారు, విజయ్ దేవరకొండకు ఫోన్ చేయడం జరిగింది.

**బాలయ్య షో లో రణబీర్ కపూర్ కామెంట్స్**

ఆ షోలో యానిమల్, అర్జున్ రెడ్డి పోస్టర్‌లను పెట్టినప్పుడు రెండు సినిమాలు తనకు చాలా ముఖ్యం అన్నట్లుగా చెప్పింది. యానిమల్ సినిమాలో నేను నటించాను కనుక ఇష్టం కాగా, అర్జున్ రెడ్డితో ఉన్న కనెక్షన్ కారణంగా ఆ సినిమా ఇష్టం అన్నట్లుగా చెప్పింది. రణబీర్ కపూర్ ఆ సమయంలో రష్మికను ఇరికించే విధంగా ఏంటి ఆ కనెక్షన్ అనడంతో హైదరాబాద్‌కి షిఫ్ట్ అయిన సమయంలో నేను మొదటగా చూసిన సినిమా అర్జున్ రెడ్డి, అందుకే ఆ సినిమా చాలా స్పెషల్ అన్నట్లుగా రష్మిక చెప్పింది. అప్పుడే రణబీర్ కపూర్ కల్పించుకుని... రష్మికను మా దర్శకుడు సందీప్ మొదటి సారి అర్జున్ రెడ్డి సినిమా సక్సెస్ వేడుక విజయ్ దేవరకొండ ఇంటి మీద జరిగినప్పుడు కలిశాడు అని చెప్పాడు. అంటే అర్జున్ రెడ్డి సక్సెస్ పార్టీకి రష్మికను విజయ్ ఆహ్వానించాడు. అప్పుడే గీత గోవిందం షూటింగ్ ప్రారంభం అయినట్లు తెలుస్తోంది.

**విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న లవ్ స్టోరీ..**

గీత గోవిందం సినిమా షూటింగ్ ప్రారంభం అయినప్పటి నుంచే వీరిద్దరి మధ్య ప్రేమ మొదలైంది అనేందుకు రణబీర్ వ్యాఖ్యలు సాక్ష్యం అన్నట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అర్జున్ రెడ్డి సినిమా సక్సెస్ పార్టీకి హాజరు కావడంకు కారణం విజయ్ దేవరకొండపై ఆమెకు ఉన్న ప్రేమ అనే వాదన వినిపిస్తోంది. రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ బెస్ట్ టాలీవుడ్ కపుల్‌గా నిలవడం ఖాయం అని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు.

ఇండస్ట్రీలో ప్రేమించి పెళ్లి చేసుకున్న హీరో హీరోయిన్స్ ఎంతో మంది ఉన్నా రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ జోడీ చాలా స్పెషల్‌గా ఉం టుంది అనే విశ్వాసంను అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు వీరిద్దరు కలిసి గీత గోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాల్లో నటించారు. మరోసారి వీరి కాంబోలో సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# జాన్వీ కపూర్ ప్రేమాయణం ఎంతవరకూ!



జాన్వీకపూర్ –శిఖర్ పహారియా ప్రేమాయణం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఏడాది క్రితం వరకూ ఇద్దరి మధ్య ప్రేమ పరుగులు పెట్టిన వైనం తెలిసిందే. ఒకర్ని విడిచి ఒకరు ఉండలేనంతగా బాండింగ్ హైలైట్ అయింది. కలిసి గుడులు గోపురాలు చుట్టేయడం...పార్టీలు..పబ్‌లు అంటూ చాలాసార్లు మీడియా కంట చిక్కారు. అంబానీ ఇంట పెళ్లిలో ఏ రేంజ్‌లో సందడి చేసారో తెలిసిందే. పార్టీ...డిన్నర్ వంటి చోట ఇరువురు ఒకరిపై ఒకరు కురిపించుకున్న ప్రేమ నెటి జనులకు ఓ బెస్ట్ మెమోరీ లాంటింది. ఇద్దరి మధ్య వేగం చూసి ఈ జంట కూడా త్వరలో వివాహ బంధంతో ఒకటి కావడం ఖాయమే అనుకున్నారంతా. అయితే నాలుగు నెలలుగా ఇద్దరు కలిసి పెద్దగా కనిపించలేదు. ఖాళీ దొరికితే ముంబై వీధుల్లో చక్కెర్లు కొట్టే జంట ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నట్లున్నారు. జాన్వీ కపూర్ పూర్తిగా సినిమాలతోనే బిజీ అయింది. తెలుగు, హిందీ సినిమాలంటూ బిజీ బిజీగా గడుపుతుంది. శిఖర్ కపూర్ సెలబ్రిటీ కాకపోవడంతో అతడి గురించి వివరాలు బయటకు రాలేదు. శిఖర్ పహారియా కూడా ఖాళీగా ఉండేవారు కాదు. లండన్లోని అంతర్జాతీయ కంపెనీలో ఇన్వెస్ట్ మెంట్ అనలిస్ట్‌గా పని చేస్తున్నాడు. అలాగే తండ్రి సంజయ్ పహారియాతో కలిసి వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాడు. సాధారణంగా ప్రేమికులు ఎంత బిజీగా ఉన్నా తమకంటూ కావాల్సిన ప్రయివేట్ స్పేస్‌ను కల్పించుకుంటారు. రోజూ కలవడం సాధ్యం కాకపోయినా వారంతంలో ఒక్కసారైనా కలవడానికి అవకాశం ఉంటుంది. జాన్వీ–శిఖర్ అలాంటి ప్రయత్నాలు చేయడం లేదా? లేక కలిసినా ఆకలయికను గోప్యంగా ఉంచుతున్నారా? అన్నది తెలియాల్సి ఉంది. ఎంత గోప్యంగా ఉన్నా? ఏదో రూపంలో లీకులొస్తుంటాయి.

అది సాయంత్రం సమయమైనా? నైట్ పార్టీ టైమ్ అయినా? ఏదో మీడియా కన్ను ద్వారా బయట పడుతుంది. కానీ ఆ ఛాన్స్ కూడా ఎక్కడా ఇవ్వనట్లే కనిపి స్తోంది. మరి అసలు కలుస్తున్నారా? లేక పనులంటూ ఎవరికి వారు బిజీగా ఉంటున్నారా? అన్నది తెలియాలి. జాన్వీ కపూర్ కొన్ని రోజులుగా తెలుగు సినిమా పెద్ది షూటింగ్‌తో బిజీగా ఉంటోన్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ముంబై టూ వివిధ లొకేషన్లకు తిరుగుతుంది. ఎక్కువగా హైదరాబాద్లో స్టే చేస్తోంది. మొన్నటి వరకూ సన్నీ సంస్కారీకి తులసీ కుమారీ సినిమా ప్రచారం పనుల్లో బిజీగా ఉంది. ఆక్టోబర్ ఆరంభంలోనే ఆ సినిమా రిలీజ్ అవ్వడంతో పెద్దికి బ్రేక్ ఇచ్చి ప్రచారంలో పాల్గొంది.

# సీక్రెట్ చెప్పకుండా సంకల్ప్ తొలిసారి!



యువ డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి ఎలాంటి సినిమా చేసినా? ఆ సినిమాకు సంబంధించిన స్టోరీ ముందే రివీల్ చేసి సినిమా తీయడం అన్నది అతడి ప్రత్యేకత. ఘాజీ, అంతరిక్షం, ఐబీ 71 లాంటి చిత్రాలు అలాగే తెరకెక్కించాడు. ఈ మూడు వాస్తవ కథలు కావడంతో వాటి గురించి ప్రేక్షకులకు ఓ ఐడియా ఉండటంతో అందులో ఎలాంటి దాపరికం లేకుండా ఓపెన్‌గా కథ ఇదని చెప్పి చేసాడు. ఘాజీ, అంతరిక్షంలాంటి సినిమాలు మంచి గుర్తింపును తెచ్చి పెట్టాయి. ఘాజీ సినిమాతో ఏకంగా జాతీయ అవార్డు కూడా అందుకున్నాడు. కానీ అలాంటి ప్రతిభావంతుడికి అవకాశాలు రావు అని మరోసారి అతడి విషయంలో ప్రూవ్ అయింది. సంకల్ప్ సినిమాలు ఇన్నో వేటివ్‌గా ఉంటాయి. అతడు రెగ్యులర్ కమర్షియల్ డైరెక్టర్ కాదు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించాలని తపించే డైరెక్టర్. ఓ కథ కోసం ఎంతో అన్వేషిస్తుంటాడు. అలాంటి సంకల్ప్ ఈ సినిమా విషయంలో మాత్రం సినిమా స్టోరీ ఏంటి? అన్నది చెప్పకుండా చేస్తున్నాడు. ప్రస్తుతం మ్యాచో స్టార్ గోపీచంద్ హీరోగా ఓ సినిమా తెరకెక్కిస్తున్నాడు. ఇదొక చారిత్రాత్మక నేపథ్యంలో సాగే యాక్షన్ చిత్రం. సినిమాకు సంబంధించి ఈ లైన్ తప్ప ఇంకే విషయం తెలియదు. సంకల్ప్ కూడా అంతే గోప్యంగా ఉంచాడు. గత సినిమాల తరహాలో ఇది ఫలానా కథ అని ఎక్కడా ఓపెన్ అవ్వలేదు. ఇప్పటికే 55 రోజుల చిత్రీకరణ కూడా పూర్తయింది. ప్రస్తుతం విరామానికి ముందు వచ్చే యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. స్టంట్ మాస్టర్ వెంకట్ ఆధ్వర్యంలో ఈ యాక్షన్ సన్నివేశాలను పూర్తి చేస్తున్నారు. గోపీచంద్ కెరీర్ లో ఇంత వరకూ ఈ తరహా పాత్రలు పోషించలేదు. గతంలో రా ఏజెంట్ తరహా పాత్రలు పోషించాడు. కానీ వాస్తవ కథల్లో ప్రత్యేకించి చారిత్రాత్మక కథల్లో కనిపించలేదు. ఈ నేపథ్యంలో గోపీచంద్ పాత్ర చాలా కొత్తగా ఉంటుందని తెలుస్తోంది. విభిన్నమైన పాత్రలో గోపీచంద్ అలరించడం ఖాయంగా టీమ్ చెబుతుంది. భారత చరిత్రలో ఎంతో కీలకమైన అధ్యాయాన్ని ఈ చిత్రం ద్వారా సంకల్ప్ ఆవిష్కరించబోతున్నట్లు నెట్టింట హైలైట్ అవుతుంది. కానీ ఆ ఆధ్యాయం ఏంటి? అన్నదే బయటకు రాలేదు. దీంతో సినిమా రిలీజ్ వరకూ ఈ సస్పెన్స్ తప్పదని తెలుస్తోంది. సినిమాకు సంబంధించి ప్రచార చిత్రాలు రిలీజ్ అయితే అంచనా వేయడానికి అవకాశం ఉంటుంది. అంత వరకూ ఆ ఛాన్స్ కూడా ఉండదు. ఈ సినిమా విజయం గోపీచంద్–సంకల్ప్ రెడ్డి ఇద్దరికీ కీలకమై. వాళ్లిద్దరు గతంలో చేసిన సినిమాలు ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో ఈ సినిమాతో హిట్ కొట్టాలని సంకల్పించి పని చేస్తున్నారు.

# సూర్య కోసం ఆమెను దించుతున్నారు.. వెంకీ పకడ్బందీ ప్లా




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య లీడ్ రోల్ లో వెంకీ అట్లూరి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న సినిమా సెట్స్ మీద ఉంది. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాలో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుంది. ఐతే సినిమాలో బాలీవుడ్ ఒకప్పటి స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ నటిస్తున్నట్టు తెలుస్తుంది. రవీనా టాండన్ తెలుగు ఆడియన్స్‌కు సుపరిచితురాలే. బాలకృష్ణతో బంగారు బుల్లోడు, నాగార్జునతో ఆకాశవీధిలో సినిమాలు చేసింది రవీనా. అప్పట్లోనే తన గ్లామర్‌తో తెలుగు ఆడియన్స్ మనసులు గెలుచుకుంది. హీరోయిన్‌గా సినిమాలు చేయకపోయినా సినిమాలు, వెబ్ సీరీస్ లతో తన ప్రెజన్స్‌తో సర్ ప్రైజ్ చేస్తుంది. యష్, ప్రశాంత్ నీల్ కాంబోలో వచ్చిన కె.జి.ఎఫ్ 2 లో నటించింది రవీనా టాండన్. ఆ తర్వాత బాలీవుడ్‌లోనే ఓటిటి సీరీస్‌లు చేస్తూ వస్తుంది. ఐతే ఇన్నాళ్లకు రవీనా మళ్లీ తెలుగు తెరపై కనిపించబోతుంది. ఈ సినిమాలో ఆమె పాత్ర కూడా ఆడియన్స్‌ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. తొలిప్రేమ, సార్, లక్కీ భాస్కర్ సినిమాలతో సక్సెస్ అందుకున్న డైరెక్టర్ వెంకీ అట్లూరి ఈసారి సూర్యతో మరో డిఫరెంట్ కథతో రాబోతున్నారు. ఈ సినిమాలో రాధిక శరత్ కుమార్ కూడా మరో ఇంపార్టెంట్ రోల్‌లో నటిస్తున్నారు. సూర్య సినిమాకు ఆయనే ఒక హైలెట్ కాగా మమితాతో పాటు రవీనా, రాధిక శరత్ కుమార్ వీళ్లంతా కూడా సినిమాకు కచ్చితంగా అడ్వాంటేజ్ అవుతారని చెప్పొచ్చు. సూర్య 46వ సినిమాగా వస్తున్న ఈ సినిమాపై ఎక్స్ పెక్టేషన్స్ ఐతే బాగానే ఉన్నాయి. రెట్రో తర్వాత కరుప్పు అంటూ నెక్ట్స్ మంత్ సెకండ్ వీక్ వస్తున్న సూర్య వెంకీ అట్లూరి కాంబినేషన్ సినిమాను నెక్ట్స్ ఇయర్ ఫస్ట్ హాఫ్ లో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. మరి ఈ సినిమా విషయంలో అయినా సూర్య ప్లాన్ వర్క్ అవుట్ అవుతుందా లేదా అన్నది చూడాలి. సూర్య సినిమా అంటే తమిళంతో పాటు తెలుగు ఆడియన్స్ లో కూడా క్యూరియాసిటీ ఉంటుంది. ఒక మంచి మాస్ హిట్ తో సూర్య కంబ్యాక్ ఇవ్వాలని అనుకుంటున్నాడు. ఐతే అది ఏ సినిమాతో సాధ్యమవుతుందో చూడాలి. సార్, లక్కీ భాస్కర్ వెంకీ అట్లూరి రెండు సినిమాలు సితార బ్యానర్ లోనే చేశాడు. ఇప్పుడు సూర్య 46 కూడా ఆ బ్యానర్ లోనే వస్తుంది. మరి ఈ సినిమాతో సితారతో వెంకీ హ్యాట్రిక్ హిట్ కొడతాడా లేదా అన్నది కూడా ఆసక్తికరంగా ఉంది. సూర్య మాత్రం ఈ సినిమాతో మంచి కంబ్యాక్ ఇవ్వాలని చూస్తున్నాడు.

# దూసుకు వస్తున్న మంతా తుఫాన్

## - ఆంధ్రప్రదేశ్‌కి తప్పని ముప్పు





**డక్కిలి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏదో ఒకచోట తీరం దాటే అవకాశం. ఆంధ్రప్రదేశ్‌కి రెడ్ అలెర్ట్. అక్టోబర్ 26, 27, 28, 29 తేదీల్లో చాలా కీలకమైన రోజులు. 28 అర్ధరాత్రి, లేదా 29 తెల్లవారుజామున సమయంలో ఆంధ్రప్రదేశ్ లో తీరం దాటనున్న మంతా. ఈ సంవత్సరం వచ్చే అన్ని తుఫానులలో బలమైన తుఫాన్ ఇదే. విశాఖపట్నం-తిరుపతి వరకు దీని ప్రభావం, తీవ్రమైన వర్షాలు తెలంగాణ, హైదరాబాద్ భారీ వర్షాలు. సముద్రం కోస్తా బాగాల్లో ఉన్నటువంటి మత్స్యకారులను అప్రమత్తం చేయాలి. ఎవ్వరు కూడా సముద్ర వేటకి వెళ్ళారాదు. దిగువున వున్నా లోతట్టు ప్రాంత లంక ప్రజలను అప్రమత్తం చేయాలి. కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలి. బలమైన గాలులు గంటకు 70-100 కిలోమీటర్లు. ఆంధ్రప్రదేశ్‌లో తీర ప్రాంత జిల్లాల్లో ఉన్న స్కూల్స్, కాలేజీ, 28, 29 తేదీల్లో సెలవు ప్రకటించవలసిందిగా వాతావరణ శాఖ అధికారులు సూచన.



దూర ప్రయాణం చేసేవాళ్ళు చెప్పిన డేట్స్‌లో ప్రయాణాలు ఆపుకోవాలి. మధ్య కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో మచిలీపట్నం, దివిసీమ అన్ని భాగాల్లో, విజయవాడ, గుంటూరు, ఏలూరు, గోదావరి జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తీవ్రమైన వర్షాలు.

# ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లో ఆటో స్టాండ్‌లో పార్కింగ్ విషయంలో వివాదం

## - ఇంచార్జ్ డి యస్ పీకి తెలియజేసిన బీజేపీ నాయకులు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గత కొద్దీ రోజులుగా నెల్లూరు నగరం లోని ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లో రెండు ఆటో కార్మిక సంఘల మధ్య వివాదం జరుగుతున్న విషయం పై శనివారం బీజేపీ పార్టీకి అనుబంధ ఆటో డ్రైవర్లు రాష్ట్ర బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు మరియు నగరఇంచార్జ్ డి యస్ పీ ద్రుష్టికి తీసుకెళ్లారు..ఆయన ట్రాఫిక్ సౌత్ సీఐకి విషయం తెలిపారు. ముత్తుకూరు బస్టాండ్ సెంటర్ మధ్యలో ఒక టాటాఏస్ వాహనం మాత్రమే పెట్టి ఉన్నారని తాము అక్కడ వాహనాన్ని పెడతామంటే కమ్యూనిస్టు పార్టీకి చెందిన యూనియన్ వారు పెట్టేందుకు లేదని ఇబ్బంది పెడుతున్నట్లు బిజెపికి చెందిన ఆటో డ్రైవర్లు తెలిపారు. సౌత్ ట్రాఫిక్ సిఐ మోత్కూర్ బస్టాండ్ చేరుకొని బిజెపి, సిపిఎం చెందిన రెండు యూనియన్ నాయకులతో మాట్లాడారు. సిపిఎం ఆటో డ్రైవర్ల వైపు నుంచి సతీష్. బిజెపి డ్రైవర్ల నుంచి మిడతల రమేష్. కందికట్ల రాజేశ్వరి తదితరులు సీఐతో మాట్లాడారు. ఇరువర్గాలు సామరస్యంగా వ్యవహరించి వివాదాలకు తావు లేకుండా సమస్యను చర్చించి పరిష్కరించుకోవాలని ఇరువర్గాలు మాట్లాడుకున్నారు.

ముత్తుకూరు బస్టాండ్ ప్రాంతంలో పెట్రోల్ బంకు వైపు ఒక ఆటో యూనియన్. అండర్ బ్రిడ్జి దక్షిణభాగం ఒక వర్గం మా ఆటో యూనియన్లు ఆటోలను నిలిపి ప్రయాణికు లను ఎక్కించుకుంటుంటారు.

ప్రస్తుతం వి ఆర్ సి వైపు నుంచి అండర్ బ్రిడ్జి వైపు వెళ్లే రోడ్డుకు మధ్యలో ఒక ఆటో మాత్రమే పెట్టడంతో వివాదం ఏర్పడుతున్నట్లు స్థానికులు అంటున్నారు. మొత్తం మీద పోలీసు ఉన్నతాధికారులు సమస్యపై దృష్టి సారించి ఉన్నారు.

# విశాలాక్షి వృద్ధాశ్రమంలో శ్రీ శాస్త్ర సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పడిపూజ










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరానికి సమీపంలో గల గొలగమూడి నందు గల విశాలాక్షి వృద్ధాశ్రమం నందు తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన శ్రీ శాస్త్ర సేవా సమితి చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం విఘ్నేశ్వర పూజ, అభిషేకం, లక్ష అర్చన, ఆశ్రమంలోని వృద్ధులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం, ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా సేవా సమితి ఫౌండర్ నటరాజన్ మాట్లాడుతూ శబరిమల దర్శనానికి వెళ్లలేని వృద్ధులకు వికలాంగులకు వారి సమక్షంలోనే పడిపూజ కార్యక్రమం తదితర కార్యక్రమాలు నిర్వహించి గాయకుడు వినోద్ కుమార్‌తో అయ్యప్ప స్వామి భక్తి పాటలు కార్యక్రమం నిర్వహించామని తెలియజేశారు. ఈ సందర్భంగా విశాలాక్షి వృద్ధాశ్రమం నిర్వాహకుడు కోసూరు రత్నం మాట్లాడుతూ తమ ఆశ్రమంలోని వృద్ధులకు అయ్యప్ప స్వామి భజన తదితర కార్యక్రమాలు నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ సెక్రటరీ రాజకుమార్, ట్రస్టీ ట్రెజరర్ నాగరాజన్, మారుతీ రామ్, ఆశ్రమంలోని వృద్ధులు వికలాంగులు, పరిసర ప్రాంతాలలోని అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెన్నానది పొర్లు కట్టలు నిర్మాణాన్ని వేగవంతం చేయండి

**- వర్షంలో తడుస్తూనే పెన్నానది కరకట్టల పరిశీలన - పొర్లు కట్టల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి - పొర్లుకట్టలకు గండ్లు పడి ఊళ్లకు ఊళ్లే నీట మునిగిన గతం పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే - తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో వుండాలి - మత్స్యకార సోదరులు వేట విరామం పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి - వరద ప్రభావిత ప్రాంతాల పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అందుబాటులో వుంటూ తీర ప్రాంత లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. సోమశిల జలాశయం నుంచి పెన్నానది లోనికి దాదాపు 1 లక్ష క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్న సందర్భంగా ఆమె ఇందుకూరు పేట మండలం నిడిముసలి గ్రామం వద్ద పెన్నానది పొర్లుకట్ట పటిష్టతను పరిశీలించారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా గ్రామస్థులతో కలిసి కాలినడకన పెన్నా పొర్లుకట్ట వద్దకు చేరుకున్నారు. 2021 లో పొర్లు కట్టకు గండి పడి నిడుముసలి, కుడితి పాళెం, గంగపట్నం, రాముడు పాళెం, ముదివర్తి పాళెం గ్రామాలు జల దిగ్బంధనంలో చిక్కుకొని ప్రజలు అష్ట కష్టాలు పడ్డ సంఘటనలను స్థానికులు ఆమెకు వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టలో పెట్టుకొని పెన్నా కరకట్టల తాత్కాలిక మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసేలా జిల్లా అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు నాయుడుకి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రానున్న భారీ వర్షాలు, ఎగువనున్న సోమశిల నుంచి పెన్నానదికి వచ్చే వరద ప్రవాహాన్ని దృష్టిలో వుంచుకొని పొర్లు కట్టలు నిర్మాణాన్ని వేగవం తం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరమత్తులే కదా అని నాసిరకంగా పనులు చేస్తే సహించేది లేదన్నారు. వాతావరణ శాఖ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వుండి వీలైనంతవరకు ఆస్థి, ప్రాణ నష్టాలు తగ్గించే ప్రయత్నం చేయాలని కోరారు. మత్స్యకార సోదరులు చేపల వేటకు తాత్కాలిక విరామం పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచించారు. అధికారులు పరస్పర సమన్వయంతో ప్రజలను విపత్తు నుంచి రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాను షెల్టర్ల వద్ద జనరేటర్, తాగునీరు తదితర ముందస్తు ఏర్పాటు చేయ డంతో పాటు రోడ్లు వరద కోతకు గురయ్యే ప్రమాదముందని ట్రాక్టర్లు జెసిబిలాంటి వాహనాలను అందుబాటులో వుంచు కోవలసిందిగా అధికారులకు ఆదేశించారు. స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు అధికారులకు సహకరించి సహాయక చర్యలలో పాల్గొనవలసిందిగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇఇ విజయభాస్కర్ రెడ్డి, తహసీల్దార్ గోపికృష్ణ, ఎంపీడీఓ నాగేంద్ర బాబు, పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఇందుకూరు పేట టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, చెంచు కిషోర్ యాదవ్, స్థానిక నాయకులు దేవిరెడ్డి రవీంద్రారెడ్డి, మధురెడ్డి, నాగరాజు, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చంద్రబాబు పేదలకు ప్రాణభిక్ష పెడుతున్నారు

**- పేద ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు - 86 మందికి సిఎంఆర్ఎఫ్ ద్వారా 1 కోటి 10 లక్షల విలువైన చెక్కులు పంపిణి - కోవూరు నియోజకవర్గంలో 17 నెలలలో 473 మంది అనారోగ్య పీడితులకు 5 కోట్ల 53 లక్షల ఆర్థిక సహాయం - నెల్లూరు పార్లమెంట్ పరిధిలో 44 మందికి 1 కోటి 10 లక్షలు అందించాం - ముఖ్యమంత్రి సహాయనిధి అనేది కూటమి ప్రభుత్వం పేదలకు అందిస్తున్న వరం - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని పేద ప్రజల బాధలు అర్థం చేసుకున్న మానవతావాదిగా అభివర్ణించారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని ఆమె నివాసంలో కోవూరు నియోజకవర్గం మరియు నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆనారోగ్య పీడితులకు ఆమె ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి 18 విడత ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణి కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని 86 మందికి 1 కోటి 10 లక్షల విలువైన చెక్కులు అందించారు. నెల్లూరు పార్లమెంట్ పరిధికి చెందిన మరో నలుగురికి 14 లక్షల 33 వేల చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 17 నెలల వ్యవధిలో కోవూరు నియోజకవర్గంలో 473 మంది అనారోగ్య పీడితులకు సిఎంఆర్ఎఫ్ ద్వారా 5 కోట్ల 53 లక్షల ఆర్థిక సహాయం అందచేసినట్టు తెలిపారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ద్వారా నెల్లూరు పార్లమెంట్ పరిధిలో 44 మందికి 1 కోటి 10 లక్షల సిఎంఆర్ఎఫ్ అందించామన్నారు. ఆసుపత్రి బిల్లులు చూసి భయపడి ఇక తమకు దిక్కెవరని కుమిలి పోతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆశాజ్యోతిగా నిలిచిందన్నారు. అనారోగ్యం పాలై ఆర్థికంగా చితికిపోయిన లక్షలాది కుటుంబాలకు సిఎం చంద్రబాబు నాయుడు పెద్ద దిక్కుగా ఆదుకుంటున్నారన్నారు.

గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన రోగాలతో బాధపడుతున్న ఎంతో మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించి, వారి ప్రాణాలను కాపాడుతున్న ముఖ్యమంత్రి కోవూరు ప్రజానీకం తరుపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి అనేది కూటమి ప్రభుత్వం పేదలకు అందిస్తున్న వరంగా పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మారనుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డి పాళెం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, మండల సమన్వయ కర్తలతో పాటు యూనిట్, క్లస్టర్ ఇంచార్జిలు మరియు తెలుగుదేశం సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరు నగర నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సరికొత్త జోష్

## పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంపై భరోసాతో టిడిపిని వీడి వైసిపిలో చేరిన 200 మంది యువత - జగన్మోహన్ రెడ్డితోనే ఈ రాష్ట్ర భవిష్యత్ అని నమ్ముతున్న ప్రజలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో..8 వ డివిజన్‌కు చెందిన అరవ రాజ అనుచర గణం 200 మంది తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని.. పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని అన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో అస్తవ్యస్తమైన పాలనతో కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటకటుకుందని అన్నారు. గడిచిన ఒకటిన్నర సంవత్సరంలో అనేకమంది కూటమి పార్టీలను వదిలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగింది అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే ఈ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం సాధ్యమని ప్రజలందరూ నమ్ముతున్నారని తెలిపారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి.. వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా నిలుస్తూ వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడి హామీల అమలుకు పోరాటాలు సాగిస్తుందని తెలిపారు. ఈ రోజు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు నచ్చక 8వ డివిజన్‌కు చెందిన ఆరవ రాజ వారి అనుచర గణం 200 కుటుంబాలు టిడిపిని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆ పార్టీ ప్రజా వ్యతిరేకతకు నిదర్శనం అన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కల్పిస్తారని తెలిపారు. ఈరోజు పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ఈ రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు.

# ఘనంగా మాధవ్ ఈవెంట్స్ డాన్స్ స్టూడియో ప్రారంభం











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో మాధవ ఈవెంట్స్ డాన్స్ స్టూడియోను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ నాయకులు వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, సినీ హీరో రోహిత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్యుల దగ్గర నుంచి ధనవంతుల వరకు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఈవెంట్స్ చేస్తూ మాధవ్ ఈవెంట్స్ జిల్లాలో మంచి పేరు సంపాదించుకుంద న్నారు. మాధవ్ ఈవెంట్స్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ డాన్స్ అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మాధవ్ ఈవెంట్స్ సంబంధించి బ్రోచర్‌ను విడుదల చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ మాధవ్ ఈవెంట్స్ అధినేత మాధవ్ నెల్లూరులోనే నెంబర్ వన్‌గా ఉన్నాడు రెండు రాష్ట్రాల్లోనే మంచి పేరు తెచ్చుకొని ముందుకి సాగుతున్నాడు మాధవి ఈవెంట్స్‌ని ప్రోత్సహించండి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్లు చిట్టిబాబు, కరిముల్లా, మాస్టర్ నటరాజ్, వెంకీ, ఇబ్రహీం, ఆర్కెస్ట్రా హరి, సత్య, జనార్దన్, విజయ్ కుమార్, నారాయణ బాబు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా శతమానం భవతి కార్యక్రమం




**నెల్లూరు, (రాజధాని వార్తలు)::** నెల్లూరు నగరంలోని ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవతి కార్యక్రమము నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో ఈ నెలలో పుట్టిన సభ్యులందరి జన్మదినం సందర్భంగా కేక్‌ని కట్ చేసి, సత్కరించి, ఆశీర్వవచన పత్రంతో శుభాశీస్సులు తెలియజేయడమైనది. గత 8 సంవత్సరాల నుండి ప్రతి నెల 4వ ఆదివారం ఆ నెలలో పుట్టిన వారికి జన్మదిన వేడుకలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాదు, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, షేక్ నసీర్ అహ్మద్, బెల్లం చెంచయ్య నాయుడు, బిరదవోలు రామమోహన రెడ్డి, కె వి కృష్ణారెడ్డి, కల్పం రమేష్, కొండూరు రామరాజు, రావూరి సుబ్బారావు, దాసరాజు వెంకట రాజు, కాగోళ్ల శివయ్య, వి ఆదినారాయణ రెడ్డి, బి సదానంద రెడ్డి, కె వెంకటరమణ, మన్నేపల్లి సురేష్, ఐ సోను మొదలగువారు పాల్గొని కార్యక్రమమును జయప్రదం చేయడమైనది. తదుపరి అందరికీ అల్పాహార విందు ఏర్పాటు చేయడమైనది. ఇట్లు నలుబోలు బలరామయ్య నాయుడు, ఎలెక్ట్ గవర్నర్.

# విక్రమ సింహపురి వర్సిటీలో విజిలెన్స్ అవగాహన వారోత్సవం

## - పౌరుల నైతిక విలువల వల్లే అవినీతి నివారణ సాధ్యం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు మై భారత్ (నెల్లూరు) సంయుక్త ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవం విశ్వవిద్యాలయం కళాశాల పరిధిలో నిర్వహించారు. "విజిలెన్స్: మన ఉమ్మడి బాధ్యత" అనే తాత్విక అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువక శాఖ అధికారి ఏ. మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ, అవినీతి నివారణకు సరిపడిన నిబంధనలు మాత్రమే కాదు, పౌరుల నైతిక విలువలు కూడా అవసరమన్నారు. యువతలో నిజాయితీ – బాధ్యత – పౌర చైతన్యం పెంపొందితేనే మంచి పాలన, పారదర్శక వ్యవస్థలు బలపడతాయని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ శంకర్ అల్లం మాట్లాడుతూ సమాజంలో నైతికతకు మనమే మూలాధారమని, ప్రతి విద్యార్థి తన వ్యక్తిగత జీవితంలో అప్రమత్తతను అలవర్చుకుంటే అవినీతి లేని భారత నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. అవగాహనతో కూడిన పౌరుడే నిజమైన బాధ్యత గల పౌరుడని అన్నారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ సిబ్బంది, మరియు హాస్టల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా బాధ్యతలు స్వీకారం చేసిన వేమిరెడ్డి కోటారెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మల్లన్నకు సేవ చేసుకునే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి. శ్రీశైలంలో శనివారం ఆయన ప్రత్యేక ఆహ్వానితులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి కోటారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియచేసారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిల కృషి ఫలితంగానే తనకు శివయ్య సేవ చేసుకునే భాగ్యం దక్కిందన్నారు. దశాబ్దాలుగా ఆధ్యాత్మిక సేవలో వున్న తాను శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆలయ అభివృద్ధికి పాటు పడతానన్నారు. సామాన్య భక్తులకు సౌకర్యాల కల్పనకై కృషి చేస్తానన్నారు.

# అందుబాటులో ఉండాలి.. సేవలు అందించాలి



**రాజన్న సిరిసిల్ల, (రాజధాని వార్తలు):** ఖరీఫ్ సీజన్ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉండాలని, సేవలు అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో జిల్లాలోని డిఆర్డిఓ, డిసిఓ, డిసిఎస్ఓ, డిసిఎంఎస్, మార్క్ ఫెడ్, మార్కెటింగ్ శాఖ, మెప్మా తదితర వ్యవసాయ తదితర శాఖల అధికారులతో ఇంచార్జ్ కలెక్టర్ శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, పత్తి, మక్కల ఇతర పంటల సాగు, దిగుబడి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని వివరించారు. ఆయా శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. రైతులు తమ పంట ఉత్పత్తులకు మద్దతు ధర పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్స్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎవ్లాటానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# ఘనంగా గైరమ్మ సంబరాలు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నాగుల చవితి పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే గైరమ్మ సంబరాలు శనివారం మండలంలో ఘనంగా జరిగాయి. స్థానిక ఎగువ వీధిలోనీ మేదర వీధిలో కొలువై ఉన్న శివపార్వతులు, నందమ్మ విగ్రహాలను పులి వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. ఏడాది ఈ సంబరాలు రుంకాన భాస్కర్ ఆధ్వ ర్యంలో జరిగాయి. ఈ ఉత్సవాలను చూసేందుకు మండలంలోని ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక మేదర వీధి నుంచి ప్రారంభమైన ఊరేగింపు సిమెంటు రోడ్డు, పొట్ట వారి వీధి, దిగువ వీధి, కుమ్మర వీధి, బూర్లి వీధి గుండా సాగింది. ఊరేగింపు అనంతరం శివపార్వతులు, నందమ్మ విగ్రహాల అనుపోత్సవ కార్యక్రమం చేపట్టారు.





# హల్చల్ చేసిన తాచుపాము

**డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, డి.రావులపాలెం, (రాజధాని వార్తలు):** అల్లవరం మండలం డి.రావులపాలెం గ్రామంలో భీమాల సత్తిరాజు ఇంటి వద్ద ఆరడుగుల భారీ తాచుపాము శనివారం హల్చల్ చేసింది. స్నేక్ స్నేచర్ వర్మకు సమాచారం అందించిన సత్తిరాజు. పామును చాకచక్యంగా బంధించిన వర్మ.

# బెటాలియన్ బ్యాండ్ టీంతో అమరవీరులకు నివాళులు

**- బెటాలియన్ కమాండర్ సాయి ప్రసాద్ - సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ ఆధ్వర్యంలో**

**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** మండలం వల్లివేడు సమీపంలోని తొమ్మిదవ బెటాలియన్ బ్యాండ్ గ్రూప్ సిబ్బందితో వెంకటగిరిలోని త్రిభువని సెంటర్ నందు "పోలీసుల సంస్మరణ దినోత్సవ వారో త్సవాలు"లో భాగంగా బ్యాండ్ షో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి 9వ బెటాలియన్ కమాండెంట్ ఎస్ సాయి ప్రసాద్ ఆదేశాలతో అసిస్టెంట్ కమాండెంట్ రామకృష్ణ సూచన లతో వెంకటగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ సహకారంతో ఈ బ్యాండు షో విజయవంతంగా నిర్వహించడం జరిగినది. ఈ క్రమంలో బ్యాండ్ షోలో బెటాలియన్ బ్యాండ్ టీం అద్భు తంగా బ్యాండ్ షో ప్రదర్శించారు. మన బెటాలియన్‌లో ఉన్న టువంటి బ్యాండ్ టీంలో సిబ్బంది ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ కాంపిటీషన్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన వారు ఉన్నారు. ఈ సందర్భంగా ఏవి రమణ మాట్లాడుతూ అమరవీరుల సంస్కరణ దినోత్సవ సందర్భంగా తొమ్మిదవ బెటాలియన్ బ్యాండ్ టీం అద్భుతంగా బ్యాండ్ వాయించడంతోపాటు పోలీస్ అమరవీ రులకు నివాళులు అర్పించారని అన్నారు. అదే విధంగా పోలీసులు




అమరవీరులు త్యాగాలు మరవలేమని అన్నారు. ఈ కార్యక్ర మంలో వెంకటగిరి ఎస్ఐ ఏడుకొండలు, ఆర్ఐ లక్ష్మయ్య, ఆరై జాలయ్య, ఆర్ఎస్ఐ బోసు, ఆర్ఎస్ఐ సురేష్ కుమార్, వెంకట గిరి పోలీస్ సిబ్బంది మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో అగ్ని ప్రమాదం

**- శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహాయం చేయాలని కోరిన బాధితులు**

**విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు మండలంలోని రామచంద్రపురం పంచాయతీలోని శ్రీహరికోట తిరపతి భార్య శ్రీహరికోట రత్నం నివాసంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగింది ఎడతెరపు లేకుండా వర్షాలు కురుస్తు న్నందువలన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన ఇంటిలో ఉన్న సామాగ్రి టీవీ ఏసి. మొబైల్, డబ్బులు. బట్టలు, అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ సందర్భంగా బాధితురాలు శ్రీహరికోట రత్నమ్మ మాట్లాడుతూ ఎడతెరపు లేకుండా వర్షాలు కురుస్తున్నందువల్ల మా ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు అగ్నిప్రమాదం జరిగింది ఆ ప్రమాదంలో టీవీ, ఏసి, మొబైల్, బట్టలు, డబ్బులు కాలిపోవడం జరిగిందని అప్పుడే పక్కన వాళ్ళని పిలిచి వారి సహాయంతో అగ్ని ప్రమాదం ని ఆర్పడం జరిగింది, అంతలోకే



మొత్తం కాలిపోయాయని తెలిపారు. వాళ్లు నిరుపేదలని కష్టం చేసుకుంటేనే పూట గడుస్తుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దయవుంచి మాకు సహాయం చేయాలని గ్రామ ప్రజలు కోరారు.

# గిరిజన కాలనీనందు పర్యటించిన బొబ్బేపల్లి



**మనుబోలు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లి గూడూరు మండలం కొత్తకోడూరు నందు పర్యటించడం జరిగింది. రాబోయే మూడు రోజులు మంతా తుఫాన్‌కి సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేయడం జరిగింది కూటమి ప్రభుత్వం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి గిరిజనులని కాపాడడంలో వాళ్లని ఆదుకోవడంలో సమాజంలో వారికి మంచి స్థానం కల్పించడంలో ఎప్పుడు కూడా వెన్నంటి ఉండే వ్యక్తి. గత ఐదు సంవత్సరాలు వాలంటీర్ వ్యవస్థను పెట్టి వైసిపి నాయకుల ప్రచారాలకి ఆర్భాటాలకి సభలకి సమావేశాలకు వినియోగించుకున్నారు తప్ప పేద ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వ పథకాలను వారికి చేరువ లోకి తీసుకురావడానికి ఉపయోగపడినటువంటి పరిస్థితి లేదు ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గురించి వారి కుమారుడు గురించి మాత్రమే మాట్లాడేటు వంటి వ్యక్తి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆయన సర్వేపల్లి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసినటువంటి పరిస్థితి లేదు పేద గిరిజనులని ఆదుకున్నటువంటి పరిస్థితి లేదు స్వతహాగా పేద గిరిజన బిడ్డలకి ఒక బిస్కెట్ ప్యాకెట్ కూడా కొనిచ్చినటువంటి ఆనవాళ్లు కూడా లేనటువంటి పరిస్థితి అటువంటి వ్యక్తికి కూటమి నాయకత్వాన్ని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని మాట్లాడే అర్హత లేదు. ఈ కార్యక్రమంలో సందూరి శ్రీహరి, పామంజి శ్రావణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan